సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం, 21, జనవరి, 2023



ఫీవర్ సర్వే

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పలు ప్రాంతాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఫీవర్ సర్వే చేపట్టారు.



ఘనంగా లీలాకల్యాణం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా లీలా కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

బలుసులమ్మకు విశేష పూజలు



తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మవారికి శుక్రవారం విశేష పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఉపాధిలో ముందంజ

ఆమెదే అగ్రస్థానం
- 57శాతం మంది మహిళలకు పనిదినాలు
- 581 గ్రామాల్లో పనులు
- గృహనిర్మాణ పథకం ద్వారా ఎక్కువగా పనుల కల్పన
- పోలవరం నిర్వాసిత కాలనీల్లోనూ పనులు



ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న మహిళా కూలీలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో ఏలూరు జిల్లా ముందంజలో ఉంది. ముఖ్యంగా మహిళలకు పనుల కల్పనలో అగ్రస్థానంలో నిలిచింది. పనుల కల్పనలో రాష్ట్రంలో 4వ స్థానంలో నిలవగా.. 57 శాతం పనులు మహిళలకు కల్పించి ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలోని 28 మండలాల్లో 581 గ్రామ పంచాయతీల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించే ప్రక్రియలో ముందంజలో ఉంది.

3.20 లక్షల కార్డుల జారీ

జిల్లాలో 3.20 లక్షల జాబ్ కార్డులను అధికారులు జారీ చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 4,39,000 మందికి ఉపాధి కల్పించారు. 1.17 కోట్ల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించగా 1,17,45,000 పని దినాలు పూర్తిచేశారు. వేతనాల రూపంలో రూ.240.06 కోట్లు కార్మికులకు అందించారు. మరో రూ.88 కోట్లు మెటీరియల్ కాంపొండ్ కింద భవన నిర్మాణాలకు ఖర్చు చేశారు. ఉపాధి హామీ కింద ఇప్పటివరకు వేతన రూపంలో ఇచ్చిన రూ.240.06 కోట్లలో అత్యధికంగా రూ.136.73 కోట్లు కేవలం మహిళా వేతనదారులకు అందించారు. ఇప్పటివరకు ఉపాధిహామీ పనుల్లో ఎస్సీలు 36.64 శాతం, ఎస్టీలు 9.14 శాతం పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పని : జిల్లాలో అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకంలో ప్రతి ఇంటికీ ఈ పథకం ద్వారా 90 రోజుల వేతనం, రోజుకు రూ.257 చొప్పున కల్పిస్తున్నారు. ఇలా 14 లక్షల పనిదినాలకు రూ.35.98 కోట్లు వేతనాలుగా చెల్లించారు. పోలవరం నిర్వాసిత కాలనీల్లో పునరావాసం కల్పించిన చోటే ఆ కుటుంబాలకు పని కల్పిస్తూ ఇప్పటివరకూ రూ.1.61 కోట్లు వేతనాల రూపంలో అందించారు. డ్వామా ద్వారా అమలవుతున్న ఉపాధి హామీ పథకంలో పని అడిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించడంతో పాటు ప్రతి సచివాలయ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 5 రకాల భవనాలైన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పాలసేకరణ కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. అలాగే వైఎస్సార్ జలకళ కింద 4 వేల బోర్లు మంజూరు చేశారు. మొక్కల పెంపకం కింద 368 ఎకరాల్లో హార్టికల్చర్ సాగుకు రైతులకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కింద 87 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచుతున్నారు. వచ్చే ఏడాది మునగ మొక్కలను ప్రతి ఇంటికి ఇచ్చి పెంపకం చేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

ఉపాధి కూలీలు.. పొందిన వేతనాలు

జిల్లాలో మొత్తం మండలాలు	28
గ్రామ పంచాయతీలు	581
జాబ్ కార్డుదారులు	3.20 లక్షలు
వేతనాలు పొందిన ఉపాధి కూలీల సంఖ్య	4.39 లక్షలు
రోజుకు సగటున అందించిన కూలీ	రూ. 257
పనులు కల్పించిన వారిలో ఎస్సీలు	36.64 శాతం
పనులు కల్పించిన వారిలో ఎస్టీలు	9.14 శాతం
ఉపాధి పొందిన మహిళలు	57.00 శాతం
మహిళలు పొందిన వేతనాలు	136.73 రూ. కోట్లు

పనిదినాల కల్పనే లక్ష్యం



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే టార్గెట్ పనిదినాలు పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. వచ్చే మూడు నెలల్లో మరో 25 లక్షల పనిదినాలు కల్పించటంతో మరో రూ.60 కోట్ల వేతనాల రూపంలో ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూచనలతో జిల్లాలో ఉపాధి హామీ పథకం దిగ్విజయంగా అమలు చేస్తున్నాం.
– పి.రాంబాబు, పీడీ, డ్వామా

కానిస్టేబుల్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

ఎస్పీ రవిప్రకాష్



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ

సాక్షి, భీమవరం: రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించే కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సీఆర్‌పీసీ, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఈనెల 22న జరిగే పరీక్షకు జిల్లావ్యాప్తంగా 40 కేంద్రాల్లో 18,190 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసిందన్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని స్పష్టం చేశారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

పరీక్షా పత్రాలు భద్రపర్చేందుకు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌ను ఎస్పీ రవిప్రకాష్ పరిశీలించారు. సీసీ టీవీ కెమెరాల పనితీరును పరిశీలించి ఆర్మ్‌డ్ గార్డులను ఏర్పాటుచేసి నిత్యం అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ బండారు శ్రీనాథ్, ఏపీఎస్ఎల్‌పీఆర్‌డీ రీజనల్ కో–ఆర్డినేటర్ డీఎస్పీ శ్రావణి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై కె.విశ్వనాథ్, ఆర్ఐ శ్రీకాంత్ ఆయన వెంట ఉన్నారు.

న్యూస్‌రీల్

డ్రైవర్లకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం భీమవరం రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి కంటి పరీక్షలు చేశారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రధానంగా కంటి చూపు బాగుండాలని, కంటి చూపులో ఏదైనా సమస్య ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. 130 మంది డ్రైవర్లకు శ్రీరాజవల్లి రాధా రమణ లయన్స్ కంటి ఆస్పత్రి (పాలకొల్లు) ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి 48 మందికి చత్వారం ఉన్నట్లు గుర్తించారు. వీరికి పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ సహకారంతో కళ్లజోళ్లు అందించారు. మేనేజర్ అల్లూరి లక్ష్మీపతిరాజు, సీహెచ్ వెంకటరమణ, కేఎస్ఎన్ ప్రసాద్, ఎం.రవి కుమార్, ఎస్ఎల్ఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు కల్పించాలి



నూతన కార్యవర్గంతో గూడూరి

వీరవాసరం: ఈబీసీ రిజర్వేషన్లను రద్దు చేసి వివిధ కులాల జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగ అవకాశాలు కల్పించాలని జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం సంఘ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశాన్ని వీరవాసరంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరావు మాట్లాడుతూ దేశ జనాభాలో ఎక్కువ శాతం ఉన్నా రాజ్యాంగ ప్రకారం బీసీలకు ప్రాధాన్యం లేదన్నారు. ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవచ్చునన్నారు. 2009లో రాజ్యాంగ హోదాతో కమిషన్‌ను ఏర్పాటుచేశారని, బీసీలకు అన్యాయం జరిగితే కమిషన్ దృష్టికి తీసుకువెళ్లవచ్చని సూచించారు. దేశ జనగణనను కులాల వారీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం వీరవాసరం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడిగా పాలా శ్రీనివాసరావు, వీరవాసరం మండల అధ్యక్షుడిగా పాలా మహేంద్ర, కార్యదర్శిగా కవురు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా పాలా కిరణ్‌బాబును నియమించారు.

స్కూల్‌గేమ్స్‌కు 'పశ్చిమ' జట్లు

పాలకోడేరు: నెల్లూరు జిల్లా ఆత్మకూరులో శనివారం నుంచి ఈనెల 23వరకు జరిగే 66వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ నెట్‌బాల్ పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా అండర్–14, 17 జట్లు శుక్రవారం గొరగనమూడి హైస్కూల్ నుంచి బయలుదేరాయని హెచ్ఎం వేంద్ర వెంకటేశ్వరరావు తెలిపారు. గొరగనమూడి, తోలేరు, పెన్నాడ, గోకవరం, విస్సాకోడేరు, అనాకోడేరు, వీరవాసరం, భీమవరానికి చెందిన క్రీడాకారులు ఉన్నారన్నారు. కోచ్ మేనేజర్లుగా ఎన్.విజయలక్ష్మి, పూడి శ్రీనివాస్, దావూద్‌ఖాన్, వినీత్ జోసఫ్‌కుమార్, విజయ్‌కుమార్, నవ్య వ్యవహరిస్తారు. జట్లను రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్, గొరగనముడి సర్పంచ్ శివాజీ రాజు, ఉప సర్పంచ్ రామాంజనేయులు అభినందించారు.

ఫొటోగ్రాఫర్లకు వర్క్‌షాపులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఫొటో వర్క్‌షాపుల ద్వారా ఫొటోగ్రాఫర్లకు ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక రామకృష్ణాపురంలోని ఎస్.గ్రాండ్ ఫంక్షన్ హాలులో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్ల కుటుంబాలకు ఆసరా పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రంలోని ఫొటో, వీడియోగ్రాఫర్లకు గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చంద్రారెడ్డి, విజయవాడ చైర్మన్ ఆర్‌వీ అప్పారావు, స్టీరింగ్ కమిటీ సభ్యుడు శ్యాంకుమార్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏలూరు జిల్లా నూతన అధ్యక్షుడిగా మద్దాల శేఖర్ (భీమడోలు), ప్రధాన కార్యదర్శిగా మెగా దుర్గారావు (ఏలూరు), గౌరవాధ్యక్షునిగా రావు (జంగారెడ్డిగూడెం)ను ప్రకటించారు. అసోసియేషన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు పి.సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● ట్రిపుల్ బొనాంజా



భీమడోలులోని ఆరోగ్యమాతా జనరల్ ఆస్పత్రిలో నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన జొన్న రమాదేవి ఈనెల 18న మధ్యాహ్నం ముగ్గురు పండంటి మగబిడ్డలకు జన్మనిచ్చింది. అయితే ఈ విషయం రెండు రోజుల ఆలస్యంగా వెలుగు చూసింది. తల్లితో పాటు ముగ్గురు శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని, ఒక్కో బిడ్డ సగటున 1.58 కిలోల బరువు ఉందని డాక్టర్ పి.అపర్ణ తెలిపారు. ఒకే కాన్పులో ముగ్గురు మగబిడ్డలు పుట్టడంపై రమాదేవి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- భీమడోలు

ధాన్యం కొనుగోలులో జిల్లా ప్రథమం

జాయింట్ కలెక్టర్ మురళి



జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మురళి

సాక్షి, భీమవరం: జిల్లాలో 3.66 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.729 కోట్లు చెల్లించామని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. నూతన ప్రక్రియ ద్వారా రైతులకు రవాణా ఇబ్బందులు తొలగాయన్నారు. రైతులకు రూ.17 కోట్లు మాత్రమే బకాయిలు ఉన్నాయన్నారు. రైతుల వద్ద ఇంకా 18,836 టన్నుల ధాన్యం ఉందని, దానిని కూడా కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు రవాణా చార్జీలు, గోనె సంచులకు రూ.5.10 కోట్లు, హమాలీ చార్జీలు రూ.90 లక్షలు చెల్లించామన్నారు. ఎరువులు, పురుగు మందులు పిచికారీకి డ్రోన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు ఉండిలోని కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. జిల్లాలోని 13,850 మంది ఆక్వా రైతులకు సంబంధించి విద్యుత్ రాయితీ మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

ప్రతిపాదనలు పంపాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, స్ప్రేయర్లు, టార్పాలిన్లు, పవర్ టిల్లర్స్, వరి కోత యంత్రాలు వంటివి రైతులకు రాయితీపై అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను కోరారు. సలహా మండలి సభ్యులు కొట్టి కుటుంబరావు, ఉద్దరాజు విజయరామరాజు, సంగాని వడ్డికాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఐడీటీఏ పీఓ బాధ్యతల స్వీకరణ

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఎం.రజిని కుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అయితే 2 గంటల్లోపు ఆమెను ఎన్టీఆర్ జిల్లాకు హౌసింగ్ పీడీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

మహిళాభ్యున్నతికి ఆసరా

- మూడో విడత పంపిణీకి రంగం సిద్ధం
- ఇప్పటికే రూ.533.89 కోట్ల అందజేత
- మూడో విడతలో మహిళలకు రూ.267 కోట్ల మేర ప్రయోజనం



సాక్షి, భీమవరం: డ్వాక్రా మహిళలకు శుభవార్త. మరో వరం అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వైఎస్సార్ ఆసరా పథకంలో జిల్లాలోని సుమారు 26 వేల స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు దాదాపు రూ.267 కోట్ల లబ్ధి చేకూర్చనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటికే రెండు విడతల్లో రూ.533.89 కోట్లను ఆసరా పథకం కింద మహిళల ఖాతాలకు జమచేశారు. తాజాగా మూడో విడత లబ్ధి అందజేతకు జాబితాలు తయారుచేశారు. దీనికి సంబంధించి అభ్యంతరాల స్వీకరణకు అర్హుల జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించారు.

పాదయాత్రలో హామీ మేరకు..

ప్రజా సంకల్ప పాదయాత్రలో భాగంగా డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తానని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంకులకు ఏ మేరకు చెల్లించాల్సి ఉందో ఆ మొత్తాన్ని నాలుగు విడతల్లో మహిళలకు అందిస్తామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా రూ.533.89 కోట్లు చెల్లించారు.

2.56 లక్షల మందికి మేలు

జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 19 మండలాల్లో తొలివిడతలో 25,833 సంఘాలకు సుమారు రూ.266.71 కోట్లు, రెండో విడతలో 25,899 సంఘాలకు రూ.267.18 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. మూడో విడతగా 25,878 సంఘాల్లో 2,56,375 మందికి లబ్ధి చేకూర్చనున్నారు. ఈ మేరకు అధికారులు ఎక్కడా లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు.

టీడీపీ హయాంలో మొండిచేయి

2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి మహిళలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు. అధికారం చేపట్టిన తర్వాత మొండిచేయి చూపడంతో పాటు 2019 ఎన్నికల ముందు మరోసారి మహిళలను మోసగించేందుకు పసుపు–కుంకుమ పథకాన్ని తీసుకువచ్చారు. అయితే చంద్రబాబు మోసాన్ని పసిగట్టిన మహిళలు ఎన్నికల్లో టీడీపీకి బుద్ధిచెప్పి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టారు.

రెండు విడతల్లో లబ్ధి ఇలా..

నియోజకవర్గం	2020–21 సంఘాలు	లబ్ధి (రూ.కోట్లలో)	2021–22 సంఘాలు	లబ్ధి (రూ.కోట్లలో)
భీమవరం	2,923	28.95	2,924	28.95
ఆచంట	4,288	43.08	4,290	43.13
నరసాపురం	3,149	32.95	3.150	65.97
పాలకొల్లు	3,248	32.48	3,250	65.05
తాడేపల్లిగూడెం	2,892	25.15	2,900	25.28
తణుకు	4,147	41.47	4,146	41.50
ఉండి	5,236	62.63	5,239	62.76

సర్వం సిద్ధం



జిల్లాలో వైఎస్సార్ ఆసరా పథకంలో డ్వాక్రా మహిళలకు మూడో విడత లబ్ధి అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో దాదాపు 25,878 సంఘాల్లో 2,56,375 మందికి లబ్ధి చేకూరనుంది. ఈ మేరకు జాబితాలు సిద్ధమయ్యాయి.
– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, భీమవరం

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI DIGITAL MEDIA GROUP
SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor
APMDC
APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్.. ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్రస్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లాస్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్రస్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు.. ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో... ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు. జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం.. ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 99124 40768, 99126 71555
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం

సాక్షి క్లాసిఫైడ్స్







మనో వ్యథతోనే ఆత్మహత్య

కొవ్వూరులో వృద్ధ దంపతుల ఆత్మహత్యపై దర్యాప్తు



మృతదేహాలను బయటకు తీసి పరిశీలిస్తోన్న పోలీసులు

ఏలూరు టౌన్: గోదావరిలోకి దూకి ఏలూరుకు చెందిన వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. కొవ్వూరులో గోదావరిలో దూకి శుక్రవారం ఈ వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులను ఏలూరు వన్‌టౌన్ పంపుల చెరువు ప్రాంతానికి చెందిన కేదారి కొండలరావు, ఉమా మహేశ్వరిగా గుర్తించారు. వీరిద్దరూ సంతోషంగా జీవించేవారు. అప్పుల బాధ లేదు.. అనారోగ్య సమస్యలు లేవు... కానీ కొన్ని సమస్యల వల్ల ఏర్పడిన మానసిక వేదన వారిని ఆత్మహత్యకు పురికొల్పాయి. దంపతులిద్దరూ ఎంతో అన్యోన్యంగా జీవిస్తోన్న తరుణంలో కుటుంబంలో తలెత్తిన పలు ఆటుపోట్లు వారిని కుంగదీశాయి. వారిద్దరూ బలన్మరణానికి పాల్పడడం బంధువులు, కుటుంబ సభ్యులను దుఃఖంలో ముంచెత్తింది.

కుమారుడి విషయంలో మనోవ్యథ

వారికి కుమారుడు, కుమార్తె ఉండగా కుమార్తెకు వివాహమై విదేశాల్లో భర్తతో ఉంటోంది. కుమారుడు శ్రీకాంత్‌కు ఇంకా వివాహం కాలేదు. ఇంకా స్థిరపడలేదని బంధువులు పేర్కొన్నారు. కొండలరావు ఏలూరు ఆంధ్రా బ్యాంకులో ఉద్యోగిగా పనిచేసి కొంతకాలం క్రితమే పదవీవిరమణ చేశారు. వన్‌టౌన్‌లోని రామకోటి సెంటర్‌లో కేదారు ఫ్యాన్సీని నిర్వహిస్తున్నారు. దంపతులిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉంటారని, ఇద్దరి మధ్య ఎలాంటి పొరపచ్చాలు లేవంటున్నారు. అనారోగ్య సమస్యలు సైతం ఏమీ లేవనే అభిప్రాయం బంధువులు వ్యక్తం చేస్తున్నారు. కుమారుడు విషయంలోనే వారిద్దరూ తీవ్రంగా మనోవ్యథకు గురయ్యేవారని చెబుతున్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఉక్కిరిబిక్కిరి చేయటంతో మానసికంగా నలిగిపోయారని అంటున్నారు. కొద్దిరోజులుగా మనోవ్యథతో బాధపడుతున్న వారిద్దరూ సేదదీరేందుకు బంధువుల ఇంటికి వెళ్ళారు. ఇంతలో గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొండలరావు, ఉమా మహేశ్వరి దంపతుల ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేవలం ఆర్థికపరమైన సమస్యలే వారిని ఆత్మహత్య చేసుకునేలా పురికొల్పాయా ..లేక మరేదైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బంధువులు, కుటుంబ సభ్యులను ఆరా తీస్తున్నట్లు సమాచారం.

● **గడపగడపకు సంక్షేమం**



పెనుమంట్ర: మండలంలోని బ్రాహ్మణచెర్వులో సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు



తాడేపల్లిగూడెం : మండలంలోని కడియద్దలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కుకునూరు: మండలంలోని గోదావరిలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. కుకునూరు ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గత కొన్ని రోజుల క్రితం ఒడిశాకు చెందిన గుత్తి కోయ కూలీల బృందం మిర్చికోతల కోసం మండలంలోని కొండపల్లి ప్రాంతానికి వచ్చారు. వారిలో మడకం భీమ(29) ఈ నెల 17న చేపల వేట నిమిత్తం నదిలోకి దిగి గల్లంతయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు నదిలో గాలించినా భీమ ఆచూకీ లభించలేదు. శుక్రవారం వేలేరుపాడు మండలం తూర్పుమెట్టగూడెం గ్రామ సమీపంలోని గోదావరిలో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు నది వద్దకు వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి చూడగా, భీమ మృతదేహంగా కుటుంబసభ్యులు గుర్తించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

25న వాహనాల వేలం

తాడేపల్లిగూడెం రూరల్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఆటో, బొలెరో కారుకు ఈ నెల 25న ఉదయం 11 గంటలకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్టు ఎస్‌ఈబీ సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.10 వేలు డిపాజిట్‌గా చెల్లించి, ఆధార్, పాన్ కార్డు నకళ్లను సమర్పించాలన్నారు. అత్యధిక మొత్తానికి పాట పాడిన వారికి వాహనాలను 18 శాతం జీఎస్టీతో స్వాధీనం చేస్తామని వివరించారు.

ఆకట్టుకున్న శ్రీవల్లీ కల్యాణం నాటకం



అలరించిన సినీ మ్యూజికల్ నైట్

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారి 59వ వార్షికోత్సవ మహోత్సవాల్లో శుక్రవారం పలు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు ముదపాక బాల సుందరం భాగవతార్ తాడేపల్లిగూడెం వారిచే ప్రదర్శించిన హరికథ, శ్రీశ్రీనివాస సినీ ఆర్కెస్ట్రా రాజమండ్రి వారి సినీ మ్యూజికల్ నైట్, రాత్రి 8 గంటలకు జై నాట్యమండలి గుడివాడ వారు ప్రదర్శించిన శ్రీవల్లీ కళ్యాణం నాటకం అకట్టుకుంది. ఉత్సవాల్లో శనివారం సాయంత్రం 5 గంటలకు కూచిపూడి, భరత నాట్యం, సాయంత్రం 6 గంటలకు మ్యూజికల్ నైట్, రాత్రి 8 గంటలకు వీరబ్రహ్మం గారి జీవిత చరిత్ర నాటకం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం



భీమవరంలో చెస్ పోటీలు ప్రారంభిస్తున్న సింధూర

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో భీమవరం విశ్వకవి స్కూల్లో రెండు రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి చిల్డ్రన్స్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను శుక్రవారం ఐఏఎస్ అధికారి రేవు ముత్యాలరాజు సతీమణి సింధూర మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భీమారావు మాట్లాడుతూ చెస్ పోటీలు 14 విభాగాల్లో జరుగుతాయని విజేతలు జనవరి 27న తమిళనాడులో నిర్వహించే జాతీయస్థాయి స్కూల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తోట భోగయ్య, అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, మేధాశక్తిని పెంపొందించడానికి చెస్‌పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరక్టర్ పాట్లూరి రఘుబాబు, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గమిని రవిపవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, అల్లు శ్రీనివాస్, కాశీ శివ రంగనాథ్, శిరిగినీడి కోటేశ్వరరావు, పెదపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ రిజర్వ్ ఎస్సై ఇంట్లో చోరీ



ఎల్‌ఎన్‌డీపేటలో చోరీ జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్సై పవన్‌కుమార్

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ ఎన్‌డీపేటలో రిటైర్డ్ రిజర్వు ఎస్సై ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. పునరావాస కేంద్రంలో ఉంటున్న వెట్టి కన్నయ్య ఈ నెల 12న వేరే గ్రామం వెళ్లి.. 18న ఇంటికి రాగా, తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.లక్ష నగదు, కాసు బంగారం చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్‌టీంను రప్పించి వేలి ముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఆర్‌జీలో బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్



హోరాహోరీగా తలపడుతున్న కొత్తపేట-పెంటపాడు కళాశాల జట్లు

పెంటపాడు: బాల్ బ్యాడ్మింటన్‌లో మహిళలు ఉన్నతంగా రాణించాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం పెంటపాడులోని గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నన్నయ వర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంపిక అనంతరం టీంను, సెలక్షన్ సభ్యులను అభినందించారు. నిడదవోలు, ఏలూరు, భీమవరం, కొత్తపేట, అనపర్తి, గోపన్నపాలెం, పాలకొల్లు, పెంటపాడు తదితర 8 కళాశాలలకు చెందిన జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. వీరిలో నుంచి ప్రతిభ చూపిన 12 మంది క్రీడాకారులను అంతర్రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసారు. వ్యాయామ అధ్యాపకుడు సత్తి బాపిరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలలో విశ్వవిద్యాలయ ఎంపిక కమిటీ సభ్యులుగా సీనియర్ వ్యాయామ అధ్యాపకులు ఆదిరెడ్డి సత్యనారాయణ, సీహెచ్ సతీష్, పి.శ్రీనివాసులు వ్యవహరించారు.





అంతర్జాతీయ సదస్సులో కల్యాణ్ ప్రతిభ



మేడిశెట్టి కల్యాణ్


కై కలూరు(కలిదిండి): ఏసియా-ఆఫ్రికా స్కాలర్స్ గ్లోబెల్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 17వ కన్సల్టెన్సీ ఫోరం వర్చువల్ అంతర్జాతీయ సదస్సులో గెస్ట్ లెక్చరర్‌గా కలిదిండి మండలం కాళ్ళపాలెం యువకుడు మేడిశెట్టి కళ్యాణ్‌కు ప్రసంగించే అవకాశం లభించింది. సమగ్రమైన, స్థిరమైన పారిశ్రామికీకరణకు మౌలిక సదుపాయాలు అంశంపై మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ 14 నుంచి 16 వరకు న్యూఢిల్లీ విద్యాభవన్‌లో జరిగే గ్లోబల్ సౌత్ యూనివర్సిటీస్ అసోషియేషన్ సమ్మిట్(జీఎస్‌యూఏ) ఆధ్వర్యంలో జరిగే జీఎస్‌యూఏ-23 సమ్మిట్, అవార్డ్స్, ఎక్స్‌పో కార్యక్రమానికి అతనికి ఆహ్వానం అందింది.

గరికపాటి ప్రవచనం



గరికపాటి నరసింహరావు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఆనంద్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మహా సహస్రావధాని గరికిపాటి నరసింహరావు ప్రవచనం అలరించింది. ప్రతీ వ్యక్తికి ప్రశ్నించే ధైర్యం రావాలని ఆయన పేర్కొన్నారు. పురాణాలలో మనకి తెలియని విషయాలపై ప్రశ్నించే గుణం ఉంటే వాటిని తెలుసుకోవచ్చని చెప్పారు. కోరికలను అదుపులో ఉంచుకుంటే దుఃఖం నుంచి విముక్తి పొందవచ్చన్నారు.



ఇద్దరు హెచ్‌ఎంల సస్పెన్షన్

సాక్షి, భీమవరం: జగనన్న గోరుముద్ద పథకంలో విద్యార్థులకు పురుగు పట్టిన బియ్యం వండి పెడుతున్న పాలకొల్లు బీఆర్‌ఎంవీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎస్. ఝాన్సీలక్ష్మీభాయిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలరోజులుగా పురుగులు పట్టిన బియ్యం వండి పెడుతున్నట్లు పాఠశాల విద్యాకమిటీ ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

గూట్లపాడు హెచ్‌ఎం సస్పెన్షన్

సాక్షి, భీమవరం: భీమవరం మండలం గూట్లపాడు ఎంపీపీ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని బి.శివనాగజ్యోతిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివనాగజ్యోతి సహ ఉపాధ్యాయులను కులం పేరుతో దూషించడమేగాక వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ రాజకీయ విభేదాలు సృష్టిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో విచారణ జరిపి ఈ నెల 19న విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.



క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



తణుకు ఆర్వోబీపై పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తణుకు అర్బన్: పట్టణంలోని శ్రీవసుంధర ఆడియో అండ్ వీడియో టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తణుకులో పేదలకు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తణుకులోని రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, ఆర్వోబీపై తలదాచుకున్న యాచకులు, పేదలకు దుప్పట్లు అందచేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు యర్రంశెట్టి గంగాధరం, సభ్యులు యర్రంశెట్టి కిషోర్, ఎం.చంటి, జె.శ్రీనివాస్, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

26 నుంచి తణుకులో ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధం

తణుకు : ప్లాస్టిక్ బ్యానర్లపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధం ఈనెల 26 నుంచి అమలు చేయనున్నట్లు తణుకు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే జీవో 75 జారీ చేసి గతేడాది నవంబరు 1 నుంచి నిషేధం అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వం కొనసాగించిందని గుర్తుచేశారు. ఇకపై తణుకు మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ బ్యానర్ల తయారు చేయడం లేదా ఉపయోగించడం చేసిన వారిపై పర్యావరణ రక్షణ చట్టం 1986 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్‌నకు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యానర్లు మాత్రమే వినియోగించాలని సూచించారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు



తణుకులో మాట్లాడుతున్న ఎంవీఐ సంజీవ్‌కుమార్

తణుకు: మానవ తప్పిదాల కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తణుకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్‌కుమార్ అన్నారు. భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జాతీయ రహదారిపై భారీ రవాణా వాహనాల డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా హైవేపై రోడ్డు చిహ్నాలు, ఎస్ఓఎస్ సౌకర్యాలు తదితర అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారి భద్రతా అధికారి రవిచంద్రన్, కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగాయత్రి దేవి ఆలయంలో విశేష పూజలు



గాయత్రి అమ్మవారి దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ గాయత్రిదేవి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ అర్చకులు కాళ్ళకూరి వీరభద్రశర్మ బ్రహ్మత్వంలో నక్షత్ర హోమం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పూలతో అలకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో లలితా సహస్ర నామ భక్త బృంద సభ్యులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మవారి దేవస్థానానికి రూ. 25 వేలు అందజేత



ముత్యాలమ్మ దేవస్థానానికి విరాళం అందజేస్తున్న మారిశెట్టి అజయ్‌బాబు దంపతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ముత్యాలాంబపురం అమ్మవారి దేవస్థానం అభివృద్ధి పనులు నిమిత్తం శుక్రవారం జిల్లా కాపు యువత అధ్యక్షుడు మారిశెట్టి అజయ్‌బాబు దంపతులు రూ. 25 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యువత సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కడియద్ద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను చేరవేస్తుందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే వారు చెప్పిన సమస్యలను సానుకూలంగా విని తగు పరిష్కార మార్గాలను అధికారులకు సూచించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అర్హత ఉండి ఇళ్లు లేదని చెప్పిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణం చేసుకోలేని వారికి అవసరమైన రుణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను పొరుగు రాష్ట్రాల వారు సైతం అధ్యయనం చేసే పరిస్థితి ఉందన్నారు. జగన్ పాలనలో న్యాయం జరిగిందనే వారే తప్ప తమకు న్యాయం జరగలేదని చెప్పే వారు లేరన్నారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతుంటే పవన్ మాత్రం జగన్‌ను గద్దె దించాలని చూస్తున్నారన్నారు. నాడు చంద్రబాబు పాలనలో ఎన్ని దుర్మార్గాలు జరిగినా నోరు మెదపని పవన్‌కు నేడు ప్రజల్ని ఓటు అడిగే హక్కు ఉందా ? అని నిలదీశారు. ప్రతి ఒక్కరికీ పార్టీ పెట్టే హక్కు ఉన్నారు. అయితే, పవన్ మాత్రం తన సొంత పార్టీ మనుగడను పక్కన పెట్టి చంద్రబాబును సీఎం చేయాలని చూస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన రణస్థలం వేదికగా తన మాటలతో జనసైనికుల గాలి తీసేశారన్నారు. చంద్రబాబుతోనే కలిసి వెళ్లేందుకు పవన్ సుముఖంగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు పవన్, చంద్రబాబులను నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోయే ఎన్నికలు పెత్తందారులు, పేదలకు మధ్య జరిగే యుద్ధమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజల్ని ఓటు అడిగే హక్కు ఎవరికైనా ఉందంటే అది సీఎం జగన్‌కేనని నొక్కి వక్కాణించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, గ్రామ సర్పంచ్‌లు యాతం కోటీశ్వరి, రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఎలిపే గాంధీ, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, ఎమ్పీటీసీలు దారపురెడ్డి దుర్గాదేవి, నార్ని శంకరరావు, కొమ్ముగూడెం, ఆరుగొలను సొసైటీ చైర్మన్‌లు వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు,ఎంఈవో వి.హనుమ, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, పీఆర్ ఏఈ జి.పవన్, ఎలక్ట్రికల్ ఏఈ పరమేశ్వరరావు, పంచాయతీ ఈవో టి.శేషుబాబు, నీలాద్రిపురం పంచాయతీ కార్యదర్శి టి.పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్టు విశాల్, ముప్పిడి సంపత్‌కుమార్, కొండుబోయిన కృపావరం, దారపురెడ్డి శ్రీనివాస్, యాతం బూరయ్య, మండల మహిళా అధ్యక్షురాలు కొల్లా విజయలక్ష్మికుమారి, పరిమి వెంకట్రావు (భూపయ్య),అడ్డాల నరసింహారావు, చింతకాయల సత్యనారాయణ, మాకా బాలాజీ, బొద్దాని శ్రీనివాస్, దాకే పండియ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉమా చంద్రశేఖర్ స్వామికి విశేష అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉమా చంద్రశేఖర్ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో మార్గశిర మాసం శుక్రవారం సందర్భంగా ఆలయంలోని ఉమా చంద్రశేఖర్ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పురోహితులు సత్యనారాయణ శర్మ, నారాయణ శర్మ బ్రహ్మత్వంలో విఘ్నేశ్వరపూజ, మహన్యాసం, మూల విరాట్‌కు పంచామృతాలతోను, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతోను విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాల త్రిపుర సుందరరావు, సెక్రటరీ శ్యాం, చొప్పర్ల శ్రీరామచంద్రమూర్తిలు పూజలు పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు

యువజనోత్సవాల్లో తణుకు విద్యార్థిని ప్రతిభ



యువజనోత్సవాల్లో విజయం సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

తణుకు టౌన్: ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకూ కర్ణాటకలోని హుబ్లీ ధర్వాడలో నిర్వహించిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో ఆది కవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ విభాగంలో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినీ వివిధ అంశాలతో పాటు యోగాథాన్ 2022లో గిన్నీస్ వరల్డ్ రికార్డును సాధించినట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థినీ అడపా కృష్ణ సాయి వర్షిత పాల్గొని రాక్ క్లైంబింగ్, స్కూబా డైవింగ్, మౌంటెన్ బైకింగ్, పాస్ట్ బోటింగ్, సివిల్ ఏవియేషన్, రోప్ వాకింగ్ విభాగాల్లో ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించినట్లు తెలిపారు. యోగా థాన్ 2022లో గిన్నీస్ వరల్డ్ రికార్డు సర్టిఫికేట్‌ను గెలుపొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఏవో డా.డీ సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు జీ రమ్య, సీహెచ్ రమేష్ బాబు, ఇతర అధ్యాపక సిబ్బంది తదితరులు అభినందించారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



తణుకులో ఎస్సీసెల్ సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

తణుకు అర్బన్: జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో తిరిగి సీఎం కుర్చీలో కుర్చోబెట్టేందుకు ఎస్సీసెల్ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాల అమలు చేస్తూ దేశ చరిత్రలో నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళిత వర్గం అండగా నిలబడేందుకు ఎస్సీసెల్ పాటుపడాలని కోరారు. తణుకు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడొచ్చినా తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తణుకు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు విజయం సాధించడంలో ఎస్సీలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తణుకు మండల ఎస్సీసెల్ కార్యదర్శి బర్రె శ్రీను, కోశాధికారి గాలంకి శ్రీను, కార్యవర్గ సభ్యులు సిర్రా సతీష్, ఎస్ వెంకటేశ్వరర్లు, నేలపాటి నవీన్, సంయుక్త భావన శ్రీను, కో ఆప్షన్ సభ్యులు కత్తుల జెస్‌పాల్ పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యాలపై సోషల్ ఆడిట్



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గురుకుల పాఠశాల రికార్డులను తనిఖీ చేస్తున్న డీసీవో వాసవి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్య నైపుణ్యాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయాధికారిణి వాసవి ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థుల విద్యాప్రమాణాలు, నైపుణ్యాలు, ఇతరత్ర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సమాధానాపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఏ-1 పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. ఆమె వెంట ప్రిన్సిపల్ బి.రాజారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

30 నుంచి జనార్ధన స్వామి కల్యాణోత్సవాలు

పెంటపాడు: ఈనెల 30 నుంచి పడమరవిప్పర్రు భూనీలా సమేత జనార్ధన స్వామి వార్షిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న అంకురార్పణ, ధ్వజారోహణం, 31న రాత్రి కల్యాణోత్సవం, ఫిబ్రవరి 1న మధ్యాహ్నం అఖండ అన్నసమారాధన, రాత్రి గరుడవాహనసేవ, 2న పంచామృత అభిషేకం, విశేష ఆరాధన, 3న చక్రస్నానం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ముగిసిన పైళ్లమ్మ జాతర

ఉండి: మండలంలోని చిలుకూరులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పైళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ, రణస్తుల మహంకాళి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

శాశ్వత భూహక్కు రైతులకు ఎంతో ఉపయోగం



వల్లూరుపల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న తహసీల్దార్

పెంటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం రైతులకు ఎంతో ఉపయోగమని తహసీల్దార జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. జగనన్నభూహక్కులో భాగంగా వల్లూరుపల్లి నుంచి బోడపాడు, చింతపల్లి గ్రామాల్లో సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ వినియోగాన్ని శుక్రవారం ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 932 ఎకరాలకు గానూ 282 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. ఈ పథకం కమతాలను సమోదు చేసేందుకు ఎంతో ఉపయోగమన్నారు. భూహక్కు పత్రాలకు ఇచ్చేందుకు, రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా ఉండేందుకు గాను ఈ సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ఈ సమస్యవల్ల రైతులు ఇప్పటివరకు ఎంతో ఇబ్బందులు పడుతుండేవారన్నారు. ఆ ఇబ్బందులు నేటితో వైలదొలగుతాయన్నారు. చైను, టేబుల్‌తో భూమిని కొలిచే స్థాయి నుంచి ఈటీఎస్ పరికరం ద్వారా రిసర్వే చేసే టెక్నాలజీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సరిహద్దు, పొలంగట్లు తదితర తగాదాలు ఇక ఉండబోవన్నారు. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విధానం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరుపల్లి, బోడపాడు గ్రామాల సర్పంచ్‌లు దంగేటి రామస్వామి, గేదల శివకుమార్, సర్వేయర్ దీప్తి, వీఆర్వోలు, డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

అత్తిలి: ఇళ్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు త్వరితగతిన గృహనిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ డీఈ కేకేటీడీ ప్రసాద్ కోరారు. అత్తిలి గ్రామ సచివాలయంలో శుక్రవారం గృహనిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం గృహం మంజూరైన 24 నెలల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. అత్తిలిలో గృహాలు మంజూరైనా అధికశాతం మంది గృహాలు నిర్మించుకోకపోవడం తగదన్నారు. లబ్ధిదారులతో గృహాలు నిర్మించుకునేలా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా విజేత, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జడ్పీ కోఆప్షన్‌మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, గంటా నాగరాజు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, హౌసింగ్ ఏఈ సత్యనారాయణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ముగ్గురు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్‌ను నియమించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పల్లెలు, పట్టణాల్లో ఆహార పదార్థాల్లో రక రకాల కల్తీలు జరుగుతున్నందున ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే నిమిత్తం వెంటనే జిల్లాకు ముగ్గురు చొప్పున ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించాలని ఏపీ స్టేట్ కన్స్యూమర్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హనుమంతరావుచే ఏపీ ఛీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టేట్ ఫుడ్ కమిషనర్‌లకు శుక్రవారం లేఖలు రాశారు. కల్తీ పాలు, కల్తీ నెయ్యి, కర్రి పాయింట్లు, స్వీట్ దుకాణాలు, మాంసం దుకాణాలు, ఇతర ఆహార పదార్థాలు కల్తీలు మార్కెట్‌లో తాండవిస్తున్నాయని వాపోయారు. కొందరు వ్యాపారస్తులు స్వలాభం కోసం కల్తీలకు పాల్పడతున్నారని, అంతేగాక పలు ప్రాంతాలలో నిల్వ పదార్థాలు అమ్ముతున్నారని వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా సంబంధిత అధికారులను ఏర్పాటు చేయడంతో పాటు, మొబైల్ వాహనం ఏర్పాటు, అధికారులచే విస్తృత తనిఖీలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఆళ్వార్‌దాస్ సేవలు స్ఫూర్తిదాయకం



ఆళ్వార్‌దాసు వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించిన వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆళ్వార్‌దాస్ సేవలు స్ఫూర్తిదాయకం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కేవీ చలం కొనియాడారు. ఆళ్వార్ దాస్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం వాకర్స్ భవనం వద్ద వాకర్స్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆళ్వార్ దాస్ ఆధ్వర్యంలో ఎనభై దశకంలో వాకర్స్ అసోసియేషన్ ప్రారంభించి ఉద్యమ స్ఫూర్తితో అనేక సేవలు అందించిన మహోన్నతుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.కుమార స్వామి, కోశాధికారి పరమాత్మ, వాకర్స్ కప్పల నరసింహమూర్తి, ప్రవా శ్రీనివాస్, బాకా వెంకటేశ్వరరావు, నార్ని సుధాకర్, ఏఆర్‌కే సత్యనారాయణమూర్తి, సారధి, వెంకట్రావు, రామోజు వీర బ్రహ్మం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో.....

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో 20వ వర్ధంతి కార్యక్రమాన్ని అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ, లక్ష్మి, ఇందిరా కుమారి, భార్గవి, మాధవి, వనచర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పందులను జనావాసాలకు దూరంగా ఉంచాలి



యాగర్లపల్లి 24వ వార్డులో చనిపోయిన పందులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జనావాసాలకు దూరంగా పందులను ఉంచే విధంగా పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది చూడాలని యాగర్లపల్లి 24వ వార్డు కాలనీ వాసులు రావడ దుర్గారావు, జి.వెంకటలక్ష్మి, టి.రాంబాబు తదితరులు పురపాలక సంఘం అధికారులకు విజ్ఞప్తి చేశారు. పందులకు తెగుళ్ళ రావడంతో చాలా పందులు చనిపోతున్నాయని, జనావాసంలో చనిపోవడం వల్ల దుర్వాసన అధికంగా వస్తుందని వాపోయారు. రాత్రి సమయాల్లో పందులు జనావాసాలలోకి రావడంతో పాటు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్ స్పందించాలని కోరుతూ జనావాసాలకు దూరంగా పందులు ఉండే విధంగా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా మహంకాళమ్మ జాతర



అమ్మవారిని దర్శించిన పట్టణ ప్రముఖులు దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ తల్లి వార్షిక జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద శుక్రవారం రాత్రి ది పవర్ ఆఫ్ డాన్స్, ఆట-5, కొరియోగ్రాఫర్ నాని మాస్టర్ అండ్ టీం వారిచే నిర్వహించిన ఢీ డ్యాన్స్ షో అలరించింది. అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు అప్పడ వైస్‌చైర్మన్ వడ్డీ రఘురాం నాయుడు, పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు బలుసులరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా దాళ్వా సాగు

ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందంటున్నా రైతులు



ఇరగవరంలో ఏపుగా పెరిగిన వెదజల్లిన చేను

ఇరగవరం: వెదజల్లిన చేను ఏపుగా పెరగడం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాళ్వా సాగులో రైతులు వెదజల్లెందుకు మక్కువ చూపారు. వెదజల్లడవ వల్ల కూలీల ఖర్చు తగ్గుతుందని రేటు కలిసి వస్తుందని, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నారుమళ్ల, నాట్లు వేసే సమయంలో కూలీల డబ్బులు కలిసి వస్తాయి. నారుమళ్ల వేయడనికి ఎకరాకు 20 నుంచి 30 కిలోల వరకు విత్తనాలు చల్లుతున్నారని రైతులు అంటున్నారు. అదే వెదజల్లడనికి 8 నుంచి 15 కిలోలు సరిపోతాయని అధికార్లు చెబుతున్నారు. దీని వల్ల 15 కిలోలు విత్తనాలు కలిసి వస్తాయని రైతులు అంటున్నారు. అంతేకాక ఎరువులు, పురుగు మందులు , అవసరం తగ్గి , ఖర్చు బాగా తగ్గుతుందన్నారు.

ముందుగానే ముగింపు

వెదజల్లు సాగు వల్ల నీటి వాడకం తగ్గుతుంది. దీని వల్ల రైతులకు చాల ఉపయోగం ఎందుకంటే సాధారణంగా దాళ్వాలో సాగు నీరు సమస్య అధికంగా ఉంటుంది. దీని వల్ల సాగునీరు ఇబ్బంది నుండి గట్టెక్కవచ్చు. మసూళ్లు కూడా సుమారు 20 రోజులు ముందుగా పూర్తి చేసుకోవచ్చు అని రైతులు అంటున్నారు.దిగుబడి ఎకరాకు సుమారు 45 నుండి 55 బస్తాలు వచ్చే అవకాశం ఉంటుంది. అంతే కాకుండా వెదజల్లడం వల్ల ఎకరాకు సుమారు 10 వేలు వరకు ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు. మండలంలోని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎక్కువ మంది రైతులు 1121 (అమ్మోరు) రకంతో పాటు 1153 రకం వరి వంగడాలను దాళ్వాకు సాగు చేస్తున్నారు. కూలి రేట్లు పెరిగి, కూలీలు దొరకని పరిస్థితులలో ఉన్న ఈ రోజుల్లో వెదజల్లేందుకే ఆసక్తి చూపించారు. మండలంలోని ఇరగవరం, కావలిపురం, కంతేరు, కత్తవపాడు గ్రామాల్లో వెదజల్లగా మిగిలిన గ్రామాల్లో తక్కువ శాతంలో వెదజల్లారు. ఏది ఏమైనా దాళ్వా సాగులో నీటి కష్టాలు ప్రకృతి వైపరీత్యాల నుండి దాటాలంటే వెదజల్లే ప్రక్రియలో సాగు చేయడమే మంచిదని రైతులు అంటున్నారు. మండలంలో సుమారు 2 వేల ఎకరాలలో వెదజల్లే సాగుకు రైతులు ఆసక్తి చూపించారు. దీని వల్ల ఖర్చుతగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. పంట ముందుగానే చేతికి వస్తుంది. వెదజల్లిన 15 రోజులలోపు చాతి, నామిని, గోల్డ్ వంటి కలుపు మందులు రెండుసార్లు పిచికరీ చేసుకోవాలి.